క్లుప్తంగా

వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ మధుకుమార్

సీతంపేట: ఇటీవల హిమాచల్ ప్రదేశ్‌లో జరిగిన వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో బుల్లయ్య కళాశాల విద్యార్థి ప్రతిభ చూపాడు. కళాశాలలో బీఏ మొదటి సంవత్సరం చదువుతున్న ఎం.తరుణ్ 81 కిలోల విభాగంలో రజత పతకం సాధించాడు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి. మధుకుమార్ విద్యార్థిని అభినందించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.ఎస్.కె.చక్రవర్తి, వ్యాయామ విభాగాధిపతి వై.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు వైభవుడికి సుప్రభాత సేవ



వైభవ వేంకటేశ్వరస్వామి

మురళీనగర్: కప్పరాడ ఎన్జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తామని ఆలయ ఈవో బి.ప్రసాద్ తెలిపారు. తెల్లవారు జామున సన్నిధిగొల్ల నిర్వహించి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్ఠి, 10 గంటలకు సాముహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన ఉంటుంది. మధ్యాహ్నం నారాయణ సేవలో భాగంగా భక్తులకు అన్నసమారాధన చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు విశేష హారతి సమర్పణలో భాగంగా నక్షత్ర హారతి, కర్పూర హారతి, కూష్మాండ హారతి, కుంభ హారతి ఇస్తారు.

మొక్కుబడి 'కౌన్సెలింగ్'

- స్టేషన్‌కు సరిగ్గా హాజరు కాని రౌడీషీటర్లు
- అధికారుల పర్యవేక్షణ అంతంతమాత్రమే..
- ఫోర్త్ టౌన్ పీఎస్‌లో మారని తీరు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న ఫోర్త్‌టౌన్ సీఐ విజయకుమార్ (ఫైల్)

సీతమ్మధార: రౌడీషీటర్లలో మార్పు తెచ్చి, సత్ప్రవర్తనతో మెలిగేందుకు నిర్వహిస్తున్న కౌన్సెలింగ్ ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో మొక్కుబడిగా జరుగుతోంది. అధికారుల పర్యవేక్షణ అంతంతమాత్రంగా ఉండటంతో రౌడీషీటర్లు దీనిని లైట్‌గా తీసుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నగరంలోనే ఎంతో కీలకమైన పోలీస్‌స్టేషన్లలో నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ ఒకటి. ప్రతి ఆదివారం స్టేషన్‌లో జరిగే కౌన్సెలింగ్‌కు రౌడీషీటర్లు అందరూ విధిగా రావాలి. ఎంతో బలమైన కారణం ఉంటే తప్ప వారంవారం స్టేషన్‌లో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాల్సిందే. ఫోర్త్ టౌన్ పీఎస్ పరిధిలో మొత్తం 43మంది రౌడీషీటర్లు ఉన్నారు. కానీ, ప్రతి ఆదివారం జరుగుతున్న కౌన్సెలింగ్‌కు పదిమంది లోపే హాజరవుతున్నారంటే పోలీసు ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

సీపీ ఆదేశాలు బేఖాతర్

'రౌడీషీటర్లు గొడవలకు దూరంగా ఉండాలని, లేదంటే నగరం వదిలి వెళ్లిపోవాల్సిందే' నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఇప్పటికే స్పష్టం చేశారు. కానీ ఈ స్టేషన్ పరిధిలో తరచూ రౌడీషీటర్లు హల్‌చల్ చేస్తున్నారు. ఇది స్థానికులను ఆందోళనకు గురి చేస్తోంది. పోలీస్ బాస్ ఆదేశాలను కచ్చితంగా అమలు చేయాల్సిన పోలీసులు, ఫోర్త్ టౌన్ పరిధిలో మాత్రం లైట్‌గా తీసుకున్నారో ఏమో గాని ఆదివారం జరిగే కౌన్సెలింగ్‌కు పూర్తిస్థాయిలో రౌడీషీటర్ల హాజరు ఉండేలా చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది.

రొటేషన్ పద్ధతిలో హాజరు!

సమాజంలో అలజడి సృష్టించే రౌడీషీటర్ల నడవడికలో మార్పు తెచ్చేందుకు పోలీస్ స్టేషన్‌లో వారం వారం నిర్వహించే కౌన్సెలింగ్ ద్వారా అవకాశం ఉంటుంది. వారు ప్రతీ వారం తప్పనిసరిగా ఈ కౌన్సెలింగ్‌కు హాజరైతేనే ఇది సాధ్యమవుతుంది. కానీ, రౌడీషీటర్లు కూడా కూడబలుక్కుంటున్నారో ఏమో గాని, రొటేషన్ ప్రకారం ప్రతీ వారం కొద్దిమంది మాత్రమే వస్తున్నారు. 'ఈ వారం మీరు కౌన్సెలింగ్‌కు వెళ్లండి, వచ్చే వారం మేము వెళ్తాం..' అంటూ ముందే నిర్ణయించుకుంటున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఫోర్త్ టౌన్ పోలీసు ఉన్నతాధికారులు కూడా చూసీచూడనట్లే వ్యవహరిస్తున్నారో ఏమో గాని, కౌన్సెలింగ్‌కు వెళ్లకున్నా ఎవరూ ఏమి అనరులే అన్న నిర్లిప్త ధోరణి రౌడీషీటర్ల అటెండెన్స్‌తో తేటతెల్లమవుతోంది. వాస్తవానికి కౌన్సెలింగ్ మరి కాసేపట్లో ప్రారంభం అవుతుందనగా హాజరు కాని రౌడీషీటర్లకు పోలీసు సిబ్బంది ఫోన్లు చేసి, వస్తున్నారా లేదా అన్న విషయం నిర్ధారణ చేసుకోవాల్సి ఉంటుంది. కానీ నాలుగో పట్టణ పోలీసులు ఈ విషయాన్ని లైట్ తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

దృష్టి సారించని అధికారులు

నగరంలో ఏదో ఒక మూల రౌడీషీటర్లు ఏదో ఒక అలజడి సృష్టిస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో కౌన్సెలింగ్‌లో రౌడీషీటర్ల హాజరుశాతం పెంచేలా కృషి చేయాల్సిన సీఐ, ఎస్ఐలు ఎందుకనో అంతగా దృష్టి సారించడం లేదనే విమర్శలున్నాయి. కౌన్సెలింగ్ అంటే రౌడీషీటర్లు ప్రస్తుతం ఏం చేస్తున్నారన్న విషయాలను కూలంకషంగా అడిగి తెలుసుకుని, వారికి మార్గదర్శనం చేయాల్సి ఉంటుంది. కానీ, ఇక్కడ మాత్రం జరిగే సీన్ రివర్స్ అంటే అతిశయోక్తి కాదు. ఇక స్టేషన్‌కు వచ్చిన రౌడీషీటర్లకు కూడా పోలీసుల కౌన్సెలింగ్ ఏదో మొక్కుబడి తంతుగా ముగిస్తున్నారే తప్ప నిర్మాణాత్మకంగా జరగడం లేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికైనా పోలీస్‌బాస్‌లు స్పందించి కౌన్సెలింగ్ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పగలే వెన్నెల

- ఉదయం కూడా వెలుగులు విరజిమ్ముతున్న వీధిలైట్లు
- పట్టించుకోని జోన్-3 అధికారులు



సత్యం జంక్షన్ వద్ద పగలు కూడా వెలుగుతున్న మోడ్రన్ లైట్లు

సీతమ్మధార: అతివృష్టి, అనావృష్టి అన్న నానుడి జీవీఎంసీ జోన్-3 పబ్లిక్‌వర్క్స్ విభాగానికి సరిగ్గా సరిపోతుందంటే అతిశయోక్తి కాదు. నియోజకవర్గం పరిధిలో గల పలు ప్రాంతాల్లో పగలు లైట్లు వెలగడం, రాత్రి పూట వెలగకపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నా పట్టించుకున్న నాథుడే కరవయ్యాడు. పలు ప్రాంతాల్లో వీధిలైట్లు పగలు, రాత్రి తేడా లేకుండా 24/7 అన్న రీతిలో దేదీప్యమానంగా వెలగడంతో విద్యుత్ వృథా అవుతోందని ఆందోళన వ్యక్తమవుతోంది. ఒకవైపు ఎల్ఈడీ లైట్ల వాడకం కారణంగా విద్యుత్ బిల్లు గణనీయంగా తగ్గిపోయిందని చెబుతున్న జీవీఎంసీ అధికారులు పగటిపూట అనవసరంగా విద్యుత్ వృథా అవుతున్నా పట్టించుకోకపోవడం పట్ల సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. సాక్షాత్తు జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ ఆదేశించినా సరే సచివాలయ ఎమినిటీస్ కార్యదర్శులు వీధిలైట్లపై పర్యవేక్షణ చేయడం లేదని తేటతెల్లం అవుతోంది. ప్రతిరోజూ విధిగా వీధిలైట్లు పరిశీలించాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేయడం తెలిసిందే. కాని పలు ప్రాంతాల్లో వీధిలైట్ల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడం గమనార్హం. మద్దిలపాలెం నుంచి గురుద్వారా వెళ్లే జాతీయ రహదారి, సత్యం జంక్షన్ తదితర ప్రాంతాల్లో గల మోడ్రన్ లైట్లు పగలు కూడా వెలుగుతూనే ఉన్నాయి. గత పది రోజులుగా ఇక్కడి లైట్లు దేదీప్యమానంగా వెలుగుతున్నాయని స్థానికులు మండిపడుతున్నారు. ఇంకా సీతమ్మధార, నక్కవానిపాలెం, పీ అండ్ టీ కాలనీ, బాలయ్యశాస్త్రి లేఅవుట్ తదితర కాలనీల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొందని పలువురు చెబుతున్నారు. ఇప్పటికైనా జోన్-3 పబ్లిక్ వర్క్స్ విభాగం ఇంజినీర్లు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

యూజీడీ లీకుతో అవస్థలు



మధురానగర్‌లో లీకవుతున్న మ్యాన్ హోల్

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు మధురానగర్‌లో 49-27-8 ఇంటి నంబరు బాలాజీ మెజిస్టిక్ అపార్టుమెంట్ వద్ద యూజీడీ మ్యాన్‌హోల్ లీకవుతోంది. మురుగునీరు రోడ్డుపై నుంచి ప్రవహించడంతో వారం రోజులుగా నివాసితులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

విశ్వనాథ సాహిత్య సమాలోచనపై చర్చ



సాహితీ చర్చలో పాల్గొన్న రచయితలు

సీతంపేట: ప్రముఖ రచయిత విశ్వనాథ సత్యనారాయణ వర్ధంతి సందర్భంగా ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శుక్రవారం విశ్వనాథ సాహిత్య సమాలోచన అంశంపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. గ్రంథాలయ సహ కార్యదర్శి డాక్టర్ డి.వి. సూర్యారావు అధ్యక్షత వహించగా, డాక్టర్ పేరి రవికుమార్ ముఖ్య అతిథిగా ప్రసంగించారు. విశ్వనాథ బహుముఖ ప్రతిభను, ఆయన మేధా సంపత్తిని దృష్టాంతాలతో రవికుమార్ విశ్లేషించారు. సాహితీవేత్తలు పేరాల హరిప్రియ, జి. ఇందిర, మేడా మస్తాన్‌రెడ్డి, ఆతుకూరి వెంకటేశ్వర్లు, చిన సూర్యనారాయణ, పేరాల బాలమురళి విభిన్న అంశాలపై ప్రసంగించారు.

పైప్‌లైన్ లీకేజీ అరికట్టారు

సాక్షి ఎఫెక్ట్..

సీతమ్మధార: జీవీఎంసీ జోన్-3 పరిధి 24వ వార్డులో మంచినీటి పైప్‌లైన్ లీకేజీకి ఎట్టకేలకు అధికారులు స్పందించి సిబ్బంది ద్వారా మరమ్మతులు నిర్వహించారు. ఈ మేరకు 'సాక్షి' దినపత్రికలో ఈనెల 17వ తేదీన 'పైప్ లైన్ లీకేజీతో నీరు వృథా' శీర్షికన వార్త ప్రచురితం కావడం తెలిసిందే. ఇక్కడి నక్కవానిపాలెంలో పైప్ లైన్ లీకవుతున్న కారణంగా ప్రతి రోజూ మంచినీరు వృథాగా కాలువలోకి పోతోందని స్థానికులు ఆందోళన చెందడంతో వార్త ప్రచురితం అయింది. ఇక్కడి క్రాంతినగర్ వీధి మధ్యలో పైప్‌లైన్ లీకవుతున్న ప్రాంతం వద్ద శుక్రవారం జోన్-3 మంచినీటి సరఫరా విభాగం సిబ్బంది మరమ్మతులు నిర్వహించారు. జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ ఆదేశాల మేరకు మంచినీటి సరఫరా విభాగం ఇంజినీర్లు సిబ్బందితో మరమ్మతులు నిర్వహించారు. సాక్షి కథనంతో మరమ్మతులు నిర్వహించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పైప్‌లైన్ లీకేజీ వద్ద నిర్వహించిన మరమ్మతులు

20న 'గద్దర్ అన్న యాది'



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కల్యాణరావు తదితరులు

సీతంపేట: ఈనెల 20వ తేదీన ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరగనున్న గద్దర్ అన్న యాది కార్యక్రమాన్ని జయప్రదం చెయ్యాలని బొడ్డు కల్యాణరావు పిలుపు నిచ్చారు. ఆరోజు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 7 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. దీనికి సంబంధించిన కరపత్రాలను శుక్రవారం సాయంత్రం స్థానిక అంబేద్కర్ భవన్ ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గద్దర్ గొప్ప చరిత్రకారుడని, ఆయన సాహిత్యాన్ని దశదిశలా వ్యాప్తి చెయ్యాలని కోరారు. గద్దర్ కుమార్తె వెన్నెల ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. గద్దర్ అభిమానులు, ప్రజా కళాకారులు, కళా సంస్థల ప్రతినిధులు, మేధావులు, విద్యార్థులు పాల్గొని జయప్రదం చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా గాయకుడు మజ్జి దేవిశ్రీ, ఉదయ భాస్కర్, ప్రకాష్, రాం ప్రభు తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్‌లో కుక్కల బెడద

- వినియోగదారుల అవస్థలు
- పట్టించుకోని మార్కెటింగ్‌శాఖ సిబ్బంది



రైతుబజార్‌లో కుక్క

సీతమ్మధార: స్థానిక రైతుబజార్‌లో ఆవులతో పాటు కుక్కలు కూడా హల్‌చల్ చేస్తున్నా పట్టించుకున్న నాథుడే కరవయ్యాడు. అటు మార్కెటింగ్ శాఖ అధికారులు, ఇటు రైతుబజార్ సిబ్బంది ఎవరూ పట్టించుకోనందునే ఆవులు, కుక్కలు బజారులో దర్జాగా తిరుగుతున్నాయని వినియోగదారులు మండిపడుతున్నారు. ఇప్పటికే బజారులో పలు ఆవులు తిరుగుతూ అందిన కాడికి కూరగాయలు, ఆకుకూరలు యథేచ్ఛగా తినేస్తున్నాయని రైతులు, వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. బజారులో నిత్యం ఆవులతో అందరూ అవస్థలు పడుతున్నా సిబ్బంది చర్యలు తీసుకోవడం లేదని ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో రైతుబజార్‌లో సెప్టెంబర్‌లో ఒక ఆవు 60 ఏళ్ల వృద్ధుడిని పొడవడంతో తలపై గాయమై రక్తస్రావం కావడం తెలిసిందే. దీంతో బజార్లో ఆవులు, కుక్కలు కనిపిస్తే చాలు వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు. రైతుబజార్‌లో ఆవులు పేడ వేయడంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది అని ఆందోళన వ్యక్తమవుతోంది. అలాగే రైతుబజార్‌లో గురువారం ఆవుపేడపై చూడకుండా కాలు వేసి జారిన ఒక మహిళ గాయాలపాలయ్యారు. రైతుబజార్‌లో నిత్యం పలు ఆవులు తిరుగుతున్నా సిబ్బంది, అధికారులు చర్యలు తీసుకోకపోవడం పట్ల పలువురు వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే రైతుబజార్‌లో ఆవులు, కుక్కలు వస్తే తప్పించుకోవడానికి కూడా వినియోగదారులకు ఎంతో కష్టంగా ఉంటుంది. ఇక్కడ రోజూ తిరిగే ఒక కుక్క ఇప్పటికే ఇక్కడ దాదాపుగా 15 మందిని కరిచిందని సిబ్బంది చెబుతున్నారు. సదరు వినియోగదారులు ర్యాబిస్ ఇంజక్షన్ల కోసం ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారులు స్పందించి సీతమ్మధార రైతుబజార్‌లో ఆవులు, కుక్కలు ప్రవేశించకుండా ప్రవేశమార్గంలో జాలీలు ఏర్పాటు చేయించాలని వినియోగదారులు కోరుతున్నారు. అలాగే జీవీఎంసీకి ఫిర్యాదు చేసి ఆవులు, కుక్కలను తరలించేలా చూడాలని కూడా వారు సూచిస్తున్నారు.

రైతుబజారు స్టాళ్లకు డ్రా



డ్రా తీసిన స్టాల్ నంబర్ టోకెన్ ఇస్తున్న ఈవో కొండబాబు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజారులో శుక్రవారం 66 రైతుల స్టాళ్లకు డ్రా తీశారు. ఉదయం 85, సాయంత్రం 66 దుకాణాలకు, స్టాళ్లకు డ్రా తీసి రైతులకు రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు టోకెన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ మార్కెటింగ్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు ప్రతివారం స్టాళ్లకు సంబంధించి డ్రా తీస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయకుడు సతీష్, రెతులు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి సీజ్

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో శుక్రవారం గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న నిందితులని విశాఖపట్నం రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో శుక్రవారం జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ కె. శాంతారాం, ఆర్పీఎఫ్ వుమెన్ ఎస్ఐ జూలి కర్మాకర్ తమ సిబ్బందితో కలిసి పలు ప్లాట్‌ఫాంలలో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తరప్రదేశ్, నోయిడా చెందిన అనూజ్‌కుమార్, ఇందర్‌భూషణ్ ఝా, మహ్మద్ సరేక్‌ల వద్ద నుండి అక్రమంగా రవాణా చేసేందుకు సిద్ధంగా ఉన్న సుమారు రూ. 64 విలువైన 12.8 కేజీల గంజాయి పట్టుకున్నారు. దాన్ని సీజ్ చేసి, సదరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న జీఆర్పీ సిబ్బంది రిమాండ్ నిమిత్తం వారిని కోర్టులో హాజరు పరిచారు.

దుర్గమ్మ ఆలయ ఆవరణలో అన్నదానం



భక్తులకు వడ్డన చేస్తున్న మాజీ కార్పొరేటర్ పోతు నాగమణి



అన్నదానం చేస్తున్న మురళీకృష్ణారెడ్డి

సీతమ్మధార: స్థానిక 24వ వార్డు రేసపువానిపాలెం వద్ద గల శ్రీ శాంతిస్వరూపిణి దుర్గా అమ్మవారి ఆలయం ఆవరణలో కేఎస్ఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదానం చేశారు. ట్రస్టు అధ్యక్షుడు కర్రి మురళీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో ఇక్కడ ప్రతి శుక్రవారం 108 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ట్రస్టు ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు, ప్రజలకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు కె .సత్యనారాయణరెడ్డి, కె.సీతయ్యమ్మ, కె.సుబ్బలక్ష్మి, ఆలయ కమిటీ ప్రెసిడెంట్ గురునాథ్‌రెడ్డి, సెక్రటరీ బాచి తదితరులు పాల్గొన్నారు.

ఎన్జీజీవోస్ కాలనీలో అన్నదానం

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు ఎన్జీజీవోస్ కాలనీలో శ్రీదుర్గా అసోసియేషన్ కమిటీకి చెందిన ఉప్పాడ రాము ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వార్డు మాజీ కార్పొరేటర్ పోతు నాగమణి ముఖ్య అతిథిగా హాజరై భక్తులకు వడ్డన చేశారు. పరిసర ప్రాంత భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో బాపిరాజు, బాష, కె. సత్తిబాబు, కె. మహాలక్ష్మి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్ల ఉపాధికి భరోసా కల్పిద్దాం

- సీపీ శంఖబ్రత బాగ్చి పిలుపు
- కోల్ ఇండియా సహకారంతో మహిళలు, ట్రాన్స్‌జెండర్లకు కుట్టు మిషన్ల పంపిణీ



ట్రాన్స్‌జెండర్లతో నగర పోలీస్ కమిషనర్ బాగ్చి, రోటరీ క్లబ్ ప్రతినిధులు

మద్దిలపాలెం: ట్రాన్స్‌జెండర్లకు స్వయం ఉపాధి కల్పించడంలో దేశంలోనే విశాఖ ఆదర్శనీయంగా నిలిచేలా కృషి చేద్దామని నగర పోలీస్ కమిషనర్ శంఖబత్ర బాగ్చి పిలుపునిచ్చారు. కోల్ ఇండియా సీఎస్సార్ నిధులు రూ.2.50 కోట్లతో ఆధునిక కుట్టు మిషన్లను మహిళలు, ట్రాన్స్‌జెండర్లకు అందించడం అభినందనీయమన్నారు. పిఠాపురంకాలనీలోని జన శిక్షణ సంస్థాన్‌లో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో సీపీ పాల్గొని.. 75 మందికి ఆధునిక కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ కుట్టు మిషన్లను ప్రతి మహిళా, ట్రాన్స్‌జెండర్లు సద్వినియోగం చేసుకుని.. ఆర్థిక స్వావలంబన సాధించాలన్నారు. మహిళలు కుట్టిన వస్త్రాలకు మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని, ఇందుకు స్వచ్ఛంద సంస్థలు సహకరించాలన్నారు. విశాఖలో ట్రాన్స్‌జెండర్లకు సరైన ఉపాధి అవకాశాలు లేక ఇతర మార్గాల్లో పయనిస్తున్నారని.. దీని ద్వారా ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. నగరంలోని ట్రాన్స్‌జెండర్లను గుర్తించి.. వారందరూ ఒకే మార్గంలో నడిచేలా ఉపాధి కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ట్రాన్స్‌జెండర్లు కుట్టు శిక్షణ తీసుకోవడం అభినందనీయమని.. వీరిని మిగిలిన వారు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కుట్టు, క్లౌడ్ కిచెన్ రంగంలో శిక్షణ ఇవ్వడానికి తన వంతు కృషి చేస్తానని సీపీ అన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళలకు సమస్యలుంటే ఫోన్ చేయండి

మహిళలు వేధింపులకు గురైతే.. తన ఫోన్ నంబర్ 79950 95799కు ఫోన్ చేసి విషయం తెలియజేయాలని సీపీ శంఖబ్రత బాగ్చి సూచించారు. మహిళల పట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, వేధించిన తన దృష్టికి తీసుకురావాలన్నారు. నగరంలో ఉపాధి కోసం సుదూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే వారు, ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగినిలు ధైర్యంగా విధులు నిర్వర్తించాలని భరోసా కల్పించారు.

సమస్యల పరిష్కారానికి 'చలో ఆర్ఎం కార్యాలయం'



చలో ఆర్ఎం కార్యాలయం కార్యక్రమంలో పాల్గొన్న ఎస్ఎంయూ నాయకులు

మహారాణిపేట: పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎంయూ ఆధ్వర్యంలో శుక్రవారం చలో ఆర్ఎం కార్యాలయం కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కోశాధికారి పీవీవీ మోహన్ హాజరై ప్రసంగించారు. అనంతరం ఆర్ఎంకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాఫేల్, పి.సుధాకర్, రామకృష్ణ, నీలకంఠం, మూర్తి, శివాజీ, శంకరరావు, వసంతరావు, సురేష్ నాయుడు, డివిజన్ చైర్మన్ రమణ, మాజీ రాష్ట్ర కార్యదర్శులు కె.చిట్టిబాబు, సత్యవతి, సింహాచలం డిపో అధ్యక్ష, కార్యదర్శులు నాయుడు, రాజు, ఈశ్వరరావు, చిన్న, సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ వ్యాలీ స్కూల్ ప్రిన్సిపాల్‌కు అవార్డు



న్యూఢిల్లీలో అవార్డు స్వీకరిస్తున్న ఈశ్వరీ ప్రభాకర్

ఆరిలోవ: విశాఖ వ్యాలీ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరీ ప్రభాకర్‌కు ప్రతిష్టాత్మకమైన ఎడ్యుకేషన్ వరల్డ్ ఇండియా స్కూల్ గ్రాండ్ జ్యూరీ అవార్డు 2024-25 వరించింది. న్యూఢిల్లీలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆమె ఈ అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె 'సాక్షి'తో ఫోన్‌లో మాట్లాడారు. డిజైన్ థింకింగ్ లీడర్‌గా ర్యాంక్ పొందినట్లు తెలిపారు.

అలరించిన కర్ణాటక గాత్ర కచేరీ



త్యాగరాజ కృతులు ఆలపిస్తున్న రిషిత లక్ష్మి

సీతంపేట: అక్కయ్యపాలెంలో గల శ్రీలలితాపీఠంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన కర్ణాటక గాత్ర కచేరీ ఆహూతులను అలరించింది. డాక్టర్ వి.గౌరీ మోహన్ శిష్యురాలు గన్నవరపు రిషిత లక్ష్మి తన మధురమైన గానంతో భక్తులకు వీనుల విందు చేశారు. త్యాగరాజ, ముత్తుస్వామి, దీక్షితార్ కృతులను ఆలపించారు. ఈమెకు వయోలిన్‌పై మంగళగిరి మోహిత్ శ్రీవ్యాస్, మృదంగంపై జతిన్ జనార్దన, తాలాడ చైతన్య వాద్య సహకారం అందించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ కళాకారులను ఘనంగా సత్కరించారు.